ఉపాధ్యాయ సమస్యలపై వినతి

మైలార్‌దేవ్‌పల్లి: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు దశల పోరాట కార్యక్రమాల్లో భాగంగా రాజేంద్రనగర్ ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... జిల్లా, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పరిష్కృత సమస్యల పరిష్కారం కోసం యూఎస్‌పీసీ దశల వారీగా పోరాట కార్యక్రమాలను చేపడతామన్నారు. అందులో భాగంగా ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించామన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, జిల్లా ఉపాధ్యక్షులు రాములయ్య, రాజేంద్రనగర్ మండల ప్రెసిడెంట్ యాదగిరి, ఉపాధ్యక్షులు సాదత్ అలీ, జిల్లా బాధ్యులు సీతయ్య, మండల కార్యాదర్శి నందన తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ జెండా ఆవిష్కరణ



మణికొండ: భారతీయ మజ్దూర్ సంఘ్ 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కోకాపేటలో ఓషియన్ పార్క్‌లో బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బి.రాజారెడ్డి మాట్లాడుతూ... కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు బీఎంఎస్ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. దేశభక్తి, తోటి కార్మికుల పట్ల సానుకూలత ఉన్న కార్మికులు ఇందులో సభ్యులుగా ఉండి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి టి. వీరేశం, ఉపాధ్యక్షుడు టి. శేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కె. సుదర్శన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. కృష్ణ, ఎం. సురేష్‌యాదవ్, కోశాధికారి ఎ. రాంచందర్, కార్మికులు పాల్గొన్నారు.


బీజేపీని మరింత పటిష్టం చేయాలి



శివరాంరెడ్డిని అభినందిస్తున్న అంజన్‌కుమార్‌గౌడ్

మణికొండ: భారతీయ జనతాపార్టీ కోసం పని చేసి పార్టీ పదవులు పొందిన నాయకులు పార్టీని మరింత పటిష్టం చేసేందుకు తీవ్రంగా శ్రమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అంజన్‌కుమార్ గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శివరాం రెడ్డిని మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే మణికొండలో ఇప్పటికే పార్టీ పటిష్టంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీలో అత్యధిక వార్డులను గెలుచుకునేలా బలం పెంచుకోవాల్సి ఉందన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బి. రవికాంత్‌రెడ్డి, జిల్లా నాయకులు సి.బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



డ్రైనేజీ శుభ్రం చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా ఉదయం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లోని రాధానగర్ కాలనీలో తడి, పొడి, హానికారక చెత్తపైలనీ ప్రజలకు కమిషనర్ అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీని శుభ్రం చేసే ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు అందించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

రాజేంద్రనగర్: అమావాస్యను పురస్కరించుకొని బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే రాత్రి 7.30 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆస్తి పన్ను పక్కదారి!

పంచాయతీల్లో బిల్ కలెక్టర్‌ల పెత్తనం

- అధికారుల పర్యవేక్షణ లోపం
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది



రామంజాపూర్ పంచాయతీ కార్యాలయ భవనం

శంషాబాద్ రూరల్: ఐదేళ్లకోసారి సర్పంచులు మారుతుంటారు.. బదిలీలతో పంచాయతీ కార్యదర్శులు వస్తూ పోతుంటారు.. కానీ బిల్ కలెక్టర్లు మాత్రం దశాబ్దాలుగా పంచాయతీల్లో తిష్ట వేసి కూర్చున్నారు. గ్రామస్తులకు వీరే పెద్ద సార్లు.. ఏ పని జరగాలన్నా వీరు అనుకుంటే చాలు.. అనే తీరులో తయారైంది పంచాయతీల్లో పరిపాలనతీరు. శంషాబాద్ మండలంలోని పంచాయతీల పాలనలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పారదర్శకత కోసం ఆస్తి పన్నుల ముదింపు.. వాటి వివరాల నమోదును ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నా.. సిబ్బంది చేతివాటం ఆగడంలేదు. ఆస్తిపన్ను వసూళ్లకు జారీ చేస్తున్న రసీదులు.. రికార్డులు కనిపించవు. వీటి తాలూకూ డబ్బులు పంచాయతీల ఖాతాల్లో జమకావడంలేదు. సంవత్సరాలుగా ఈ తంతు కొనసాగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పన్ను వసూళ్ల రసీదు పుస్తకాలను కొన్ని చోట్ల నకిలీగా వాడుతున్నట్లు సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రసీదులపై బిల్ కలెక్టర్ల స్టాంపు, సంతకాలు ఉండటం గమనార్హం.

ఆన్‌లైన్ ప్రక్రియకు తూట్లు...

మండలంలో 21 పంచాయతీలు ఉండగా.. ఆస్తి పన్ను వివరాల ఇంకా పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలేదు. పంచాయతీల్లో ఆస్తి పన్నుల మదింపు, ఆన్‌లైన్ నమోదు ప్రారంభించి సుమారు 13 ఏళ్లు కావస్తున్నా.. పూర్తి స్థాయిలో వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పర్చడంలేదు. దీంతో పంచాయతీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

రసీదు పుస్తకాలకు లెక్కలుండవు...

ఆన్‌లైన్‌లో నమోదు కాని ఆస్తి పన్నుల వసూళ్లకు పంచాయతీ నుంచి రసీదు జారీ చేస్తుంటారు. అయితే ఈ రసీదు పుస్తకాలకు సరైన లెక్కలు కనిపించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో నమోదైన ఆస్తిపన్నుల వసూళ్లను మాత్రమే అధికారులు, ఆడిటింగ్‌లో లెక్కలోకి తీసుకుంటున్నారు. మిగతా వాటికి సిబ్బంది జారీ చేస్తున్న రసీదుల వివరాలు పట్టించుకోవడంలేదు. దీంతో గ్రామస్తుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుంటున్న సిబ్బంది.. వారికి రసీదు జారీ చేస్తున్నా.. వాటి తాలూకు డబ్బులు పంచాయతీ ఖాతాల్లో జమకావడంలేదు.
- పంచాయతీల్లో బిల్ కలెక్టర్లదే హవా కొనసాగుతోందనే ప్రధాన ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరికి కొంత మంది ప్రజాప్రతినిధులు, నాయకులు మద్దతు ఇస్తుండటంతో వీరి ఆగడాలు మితిమీరి పోతున్నాయి. గ్రామాల్లో ఆస్తి తగాదాలకు వీరు మూల కారణం అవుతున్నారు. గ్రామ కంఠం స్థలాలు, ఇళ్లకు సంబంధించిన ఆస్తి మార్పిడి సమయంలో వీరు జారీ చేస్తున్న పత్రాలను పరిగణలోకి తీసుకుని మరీ.. రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకే చోట ఏళ్ల నుంచి వీరు పంచాయతీల్లో తిష్ట వేయడంతో.. పంచాయతీల్లోని లొసుగులు, స్థానికుల అవసరాలను వీరు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

ఖాళీ స్థలాలకూ ఇంటి నెంబర్లు...

ఆయా పంచాయతీల్లో ఖాళీ స్థలాలకు ఇష్టానురీతిన ఇంటి నెంబర్లను కేటాయించారు. ప్రతి సంవత్సరం వీరి నుంచి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. జీఓ 111 పరిధిలో ఉన్న మండలంలోని 19 పంచాయతీల్లో నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదు. అలాంటిది డబ్బులకు ఆశపడి, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఖాళీ స్థలాలు, రేకుల షెడ్లులకు ఏకంగా ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారు.

“ రికార్డులు సరి చేస్తాం

రామంజాపూర్ పంచాయతీలో జారీ అయిన రసీదుల ఆస్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు లేనట్లు గుర్తించాము. ఆస్తి మార్పిడి హక్కుల కోసం రిజిస్ట్రేషన్‌కు వెళ్తే.. సరైన పత్రాలు లేకుండా రిజిస్ట్రేషన్ చేయవద్దని శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్‌కు తెలియజేశాం. పంచాయతీలో ఆస్తి పన్ను వసూళ్లలో పారదర్శకత పాటించేందుకు రికార్డులను సరి చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– నాగరాజు, కార్యదర్శి, రామంజాపూర్

వెలుగులోకి అవకతవకలు..

రామంజాపూర్ పంచాయతీలో ఏళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లిస్తున్న కొంత మంది ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. వీటి తాలూకూ వసూళ్ల డబ్బులు ఎక్కడ జమ చేశారో అధికారులకు తెలియడంలేదు. ఈ విషయం ఇటీవలే వెలుగు చూడగా.. ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే కానీ పన్నులు చెల్లించమని బాధితులు పేర్కొంటున్నారు.



- కవేలిగూడ చౌరస్తాలో ఉన్న వ్యాపారస్తులకు పంచాయతీ నుంచి వృత్తి, వ్యాపార లైసెన్సులు జారీ చేసి పన్నులు వసూలు చేస్తున్నారు. అయితే ఇక్కడ 80 శాతం పన్నుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. వాటి తాలూకూ పన్ను డబ్బులు ఏమైపోతున్నాయో అర్థం కావడంలేదు.
- కవేలిగూడ గ్రామంలోని గ్రామ కంఠంలో ఉన్న ఆస్తిపై ఉన్న హక్కుల మార్పిడి కోసం బిల్ కలెక్టర్ జారీ చేసిన పత్రం ఆధారంగా రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ పత్రం జారీ కోసం పంచాయతీ సిబ్బంది రూ. 2 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఎలాంటి అధికారం లేని బిల్ కలెక్టరు ఇచ్చిన పత్రాలతో ఆస్తి మార్పిడి చేయడం గమనార్హం.
- రామంజాపూర్ గ్రామంలో ఒకే ఇంటికి సంబంధించిన ఆస్తి పన్ను రసీదును రెండు వేర్వేరు పేర్లతో జారీ చేశారు. సదరు యజమానిని స్థానికులు రెండు పేర్లతో పిలుస్తుంటారు. రికార్డుల్లో ఉన్న పేరుతో కాకుండా స్థానికులు పిల్చుకునే పేరుతో రసీదు జారీ కావడం గమనార్హం. ఇతని ఆస్తి వివరాలను ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు.

వరద సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలకు ఎలాంటి వరద సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అధికారులకు సూచించారు. ఆయా సమస్యల పరిష్కారంపై బుధవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వర్షాకాలంలో తలెత్తే డ్రైనేజీ సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. ఎక్కడైనా డ్రైనేజీలు బ్లాక్ లేదా ఓవర్ ఫ్లో అయినా వాటిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యం, భద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అందుకు తగ్గట్లుగా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్, హెచ్ఎండబ్ల్యూఎస్ రాజేంద్రనగర్ మేనేజర్ లక్ష్మీ, జీహెచ్ఎంసీ ఈఈ నరేంద్ర పాల్గొన్నారు.

అలకాపూర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మించండి

- హెచ్ఎండీఏ కమిషనర్‌కు మంత్రి ఆదేశం
- నెరవేరనున్న దశాబ్దపు కల



మంత్రిని కలిసిన మణికొండ కాంగ్రెస్ నాయకులు

మణికొండ: అలకాపూర్‌వాసుల చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరనుంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోనే అతిపెద్ద టౌన్‌షిప్ అయిన అలకాపూర్‌లో కమ్యూనిటీ హాల్ లేక పోవటంతో సామూహిక కార్యక్రమాలను నిర్వహించుకోలేక పోతున్నామంటూ మలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. అందుకు అవసరమైన స్థలం విషయంలో అడ్డంకులు రావటంతో నిర్మాణం సాధ్యం కాలేదు. ఎట్టకేలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్‌లు హెచ్ఎండీఏ కమిషనర్‌కు లేఖలు రాశారు. సదరు లేఖలను బుధవారం కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబును కలిసి అందజేశారు. దాంతో ఆయన వెంటనే హెచ్ఎండీఏ కమిషనర్‌కు అలకాపూర్ టౌన్‌షిప్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని మొదలు పెట్టాలని మౌఖిక ఆదేశాలను ఇచ్చి లేఖలపై సంతకాలు చేశారని జితేందర్ తెలిపారు. టౌన్‌షిప్ పరిధిలోని సర్వే నెంబర్ 134లోని ప్రజావసరాల నిమిత్తం వదిలిన భూమిలో దాన్ని నిర్మింపచేస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌లు కె.లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, మాజీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న వార్డు అధికారులు

మణికొండ: అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లోని ఇంకుడు గుంతలను ఆయన ఆదేశాలను వార్డు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి వాడకం విపరీతంగా పెరుగుతుందన్నారు. ఈనేపథ్యంలో బోర్లు వట్టిపోకుండా, నీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే తప్పనిసరిగా వీలైనన్ని ఎక్కువగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకుడు గుంతలు లేని వారికి వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించామన్నారు. రాబోయే రోజుల్లో రోడ్ల పక్కన నీరు నిలిచే చోట్ల మున్సిపాలిటీ నుంచి వాటిని వీలైనన్ని ఎక్కువ ఏర్పాటు చేస్తామన్నారు.

గుంతలమయమైన రోడ్లు

అత్తాపూర్: అంతర్గత రోడ్ల నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా చేపట్టకపోవడంతో వరద నీరు రోడ్లపై నిలిచిపోతూ స్థానికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ సిరిమల్లె నగర్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, కొండల్‌రెడ్డి అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాలు, ఇస్తా సిటీ, కాంతారెడ్డినగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల కాలనీవాసులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీల ఏర్పడిన నాటి నుంచి రోడ్డు నిర్మాణ తీరు అధ్వానంగా మారిపోయింది. రోడ్డు నిర్మాణ పనులు సమాంతరంగా చేయకపోవడంతో సమస్య రోజురోజుకూ మరింత జఠిలంగా మారిపోతుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద నీరు ఇళ్లల్లోకి ప్రవేశిస్తుంది. స్థానికంగా ఉన్న మ్యాన్‌హోల్స్, చెత్తాచెదారులతో నిండిపోవడం కారణంగా రోడ్డుపై నిలిచిన వరద నీరు స్థానికంగా నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణాలు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించే సమయంలో జీహెచ్ఎంసీ అధికారులు భవిష్యత్ అవసరాలను విస్మరించినందునే ఈ పరిస్థితులు నెలకొన్నాయని కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వనం నర్సింహా, తుమ్మల కృపాకర్‌రెడ్డి తదితరులు ఆరోపించారు. డీసీ రవికుమార్ స్పందించి రోడ్లపై గుంతలను పూడ్చి అవసరమైన ప్రాంతాల్లో కొత్త రోడ్లను నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

చెట్ల కొమ్మల తొలగింపు



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపైకి వస్తున్న చెట్టు కొమ్మలను అధికారులు తొలగిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా ఈ తొలగింపు పనులను నిర్వహిస్తున్నారు. బుధవారం టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి బండ్లగూడ వైపు వెళ్లే రహదారిపైకి వస్తున్న చెట్ల కొమ్మలను సిబ్బంది చేత తొలగించారు. ఈ పనులను ఆర్ఐ ప్రదీప్‌కుమార్, ట్రాఫిక్ పోలీసులు పర్యవేక్షించారు.

అసిస్టెంట్ సబ్ పోస్టాఫీసర్‌పై చీటింగ్ కేసు

లంగర్‌హౌస్: డబ్బులు కాజేసిన ఓ అసిస్టెంట్ సబ్ పోస్టాఫీసర్‌పై చీటింగ్ కేసు నమోదు అయిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలో నివాసముండే ఆనంద్‌కుమార్ లంగర్ హౌస్‌లోని పోస్టాఫీస్ కార్యాలయంలో అసిస్టెంట్ సబ్ పోస్ట్ అధికారిగా ఏడాది క్రితం విధుల్లో చేరాడు. ఆఫీసులో రూ. 9 లక్షల డిపాజిట్లు ఉండగా అందులో రూ. 7 లక్షలు కాజేశాడు. రూ. 2 లక్షలు మాత్రమే నగదు ఉందని తెలుసుకున్న తంతి తపాలా పశ్చిమ మండల అధికారి శ్రీనివాస్ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం ఆనంద్‌కుమార్‌పై లంగర్‌హౌస్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆనంద్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ మండల పరిధిలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్‌కుమార్ తెలిపారు. రాజేంద్రనగర్ మండలం కోశాధికారి సంజయ్ అధ్యక్షతన బంద్ నిర్వహించారన్నా. ఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, కార్యదర్శి జాజాల తనిష్కయాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు, ఎంఈవో, డీఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలైన చైతన్య, నారాయణ కళాశాలలు, పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని బంద్ నిర్వహించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. లేనిపక్షంలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సామంత్, సోను, బన్నీ, రేవంత్, వంశీ, దీక్షిత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యా సంస్థల బంద్‌లో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు